సాక్షి శ్రీకాకుళం

ఆదివారం | 20 | జూలై | 2025



కబడ్డీ.. కబడ్డీ

తెలుగు కబడ్డీ లీగ్‌కు సన్నాహాలు జరుగుతున్నాయి. కాకినాడ వేదికగా ఎంపికలు జరుగుతాయి. - 8లో



తమ్మినేని పరామర్శ - 8లో

హత్యకు గురైన కార్యకర్త కుటుంబాన్ని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పరామర్శించారు.



న్యూస్‌రీల్

'పచ్చని ఉద్దానంలో కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణం సరికాదు'

పలాస: పచ్చని ఉద్దానం ప్రాంతంలో కార్గో ఎయిర్‌పోర్టును నిర్మాణం చేయాలనుకోవడం సరికాదని, దీన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకుడు కోనేరు రమేష్ చెప్పారు. బొడ్డపాడు గ్రామంలో ఆయన శనివారం మాట్లాడుతూ జీడి, కొబ్బరి తోటలను పెంచుతూ వేలాది మంది రైతులు బతుకుతున్నారని వాటిని నాశనం చేసి ఎయిర్ పోర్టు నిర్మించడం పర్యావరణానికి మంచిది కాదన్నారు. గురుపూజోత్సవం నాడు రాష్ట్రంలో రెండు కోట్ల మొక్కలను నాటి రికార్డు సాధించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహజ వనరులను కాపాడాలి గానీ ఈ విధంగా ఉద్దానంలో చెట్లను నరికి విధ్వంసం సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం ఎంతవరకు సబబన్నారు. తక్షణమే ఎయిర్ పోర్టు నిర్మాణ ప్రతిపాదనను విరమించుకోవాలని, లేకపోతే తగిన మూల్యం చెల్లించుకుంటారని ఆయన హెచ్చరించారు.

ఎరువుల కోసం రైతుల నిరీక్షణ



ఎరువుల కోసం నిరీక్షిస్తున్న రైతులు

సారవకోట: మండలంలోని చీడిపూడి రైతు సేవా కేంద్రంలో శనివారం ఎరువుల కోసం రైతులు నిరీక్షించారు. ఈ రైతు సేవా కేంద్రానికి ఎరువులు వచ్చాయని తెలుసుకున్న ఆ రైతు సేవా కేంద్రం పరిధిలో ఉన్న రైతులు చేరుకున్నారు. ఇక్కడున్న వీఏఏ ఆన్‌లైన్‌లో వాటిని నమోదు చేసి ఇచ్చేందుకు ఆలస్యం కావడంతో ఎరువుల కోసం చాలాసేపు నిరీక్షించాల్సి వచ్చింది. చాలామంది రైతులు నిరీక్షించలేక తిరిగి ఇంటికి వెళ్లిపోయారు.

'సమస్య పరిష్కరించే వరకు సమ్మె ఆగదు'



మోకాళ్లపై నిలుచుని నిరసన తెలుపుతున్న కార్మికులు

కాశీబుగ్గ: ప్రభుత్వం జోక్యం చేసుకొని తమ సమస్యలు పరిష్కారం చేసే దాకా సమ్మె ఆగదని మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ నెల 16 నుంచి తలపెట్టిన మున్సిపల్ కార్మికుల సమ్మె శనివారానికి నాల్గో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కాశీబుగ్గ సంత మైదానంలో మోకాళ్లపై నిలుచుని నిరసన చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెయ్యిల గణపతిరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చింతల మురగన్, కె.వెంకట్, ఎం.రవి, ఎస్.శంకర్ తదితరులు మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా శానిటేషన్ కార్మికులు, ఇదివరకు మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు ఆందోళనలు సమ్మెలు చేసినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండడం తగదని అన్నారు.



ఎండ తీవ్రతకు గొడుగులు వేసుకుని స్కార్ఫ్ కట్టుకొని వెళ్తున్న ప్రజలు





సాయంత్రం కురిసిన వర్షానికి గొడుగులు, రెయిన్ కోట్లు వేసుకుని వెళ్తున్న విద్యార్థులు, ప్రజలు

ఎండ.. వాన

జిల్లా కేంద్రంలో వాతావరణ పరిస్థితులు విచిత్రంగా మారిపోతున్నాయి. శనివారం ఉదయమంతా ఎండలు భగభగ మండిపోయాయి. మధ్యాహ్నం మూడు గంటల సమయానికి వాతావరణం ఒక్కసారిగా మారి వర్షం పడటంతో ప్రజలు ఉపశమనం పొందారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

ఈ చిత్రం చూశారా? రైతు సేవా కేంద్రాల్లోనో గ్రామ సచివాలయాల్లోనో దించాల్సిన ఎరువులను టీడీపీ నాయకుడు అధికార దర్పంతో తన ఫామ్‌హౌస్ వద్ద దించుకున్న దృశ్యమిది. ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందించే ఎరువులను నిల్వ చేసేందుకు గ్రామస్థాయిలో రైతు సేవా కేంద్రం ఉన్నా గ్రామ సచివాలయం ఉన్నా అక్కడ కాదని పొందూరు మండలం దల్లిపేటలో టీడీపీ నాయకుడు బి.రఘునాథ రెడ్డి ఫాంహౌస్ వద్ద లారీ యూరియా లోడ్ దించారు. అక్కడే తనకు కావాల్సిన వారికి యూరియా అందజేస్తున్నారు.



సొత్తు ప్రజలది..
పెత్తనం నేతలది..

- రైతులకు తప్పని అవస్థలు
- ప్రభుత్వ ఎరువులు తమ ఆధీనంలో ఉండేలా టీడీపీ నాయకుల అరాచకం
- టీడీపీ సానుభూతి పరులకే అందేలా కుట్రలు
- ప్రభుత్వ కార్యాలయాల్లో కాకుండా తమ ఇళ్లల్లో, ఫామ్ హౌస్, ప్రైవేటు గోడౌన్‌లలో ఎరువులను దించుకుంటున్న దుస్థితి
- రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌ల కేంద్రాల్లో కూడా పచ్చనేతల హవా

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ప్రజాధనంతో కొన్న ఎరువులవి.. జనాలకు పంచాల్సిన ఎరువులవి. కానీ వాటిపై టీడీపీ నేతలు పెత్తనం చెలాయిస్తున్నారు. ఎరువుల పంపిణీలో టీడీపీ నాయకుల బరితెగింపు పతాక స్థాయికి చేరింది. రైతులకు వన్‌బీ ప్రకారంగా ఇవ్వాల్సిన ఎరువులను సైతం పక్కదారి పట్టిస్తున్నారు. తమ సొత్తు అన్నట్టుగా తమ ఇళ్లల్లో, తమకు చెందిన ప్రదేశాల్లో అన్‌లోడ్ చేసుకుని అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. టీడీపీ నాయకుడి ఫామ్‌హౌస్‌లో యూరియా పంపిణీ చేయడంపై దల్లిపేట, పుల్లాజీపేట గ్రామస్తులైతే పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఆ ఫామ్ హౌస్‌కు వెళ్లి తీసుకోబోమని, సచివాలయంలో విక్రయిస్తేనే తీసుకుంటామని సుమారు 200 మంది రైతులు వన్‌బీలు పట్టుకుని నిరసన తెలియజేశారంటే పరిస్థితి ఏ స్థాయికి వెళ్లిందో అర్థం చేసుకోవచ్చు.



సచివాలయంలో ఇస్తేనే ఎరువులు తీసుకుంటామంటూ నిరసనకు దిగిన దల్లిపేట, పుల్లాజీ పేట రైతులు

బాబు పాలనలో తప్పని అవస్థలు

రైతు ఎంత సాగు చేస్తున్నారో? వారికెంత ఎరువులు అవసరమో? ఈ క్రాప్ ద్వారా వైఎస్ జగన్ ప్రభుత్వంలో ముందే గుర్తించేవారు. ఆ మేరకు రైతులకు సరిపడా ఎరువులు నేరుగా ఇంటికే రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ క్రాప్ కార్యక్రమాన్ని పక్కన పెట్టేశారు. జిల్లాలో ఏ రైతులు ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారో వంటి వివరాలు అధికారుల వద్ద అందుబాటులో లేవు. దీంతో టీడీపీ నాయకుల జోక్యం పెరిగి రైతులకు వైఎస్ జగన్ ప్రభుత్వం ముందు వరకు ఉన్న అవస్థలు తప్పడం లేదు. అసలే కొరత ఆపై అరకొర యూరియా వెరసీ ఎటూ సరిపోవడం లేదు. ఎక్కడ చూసినా భారీ క్యూలు తప్ప రైతులందరికీ యూరియా దొరకడం లేదు. చంద్రబాబు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎలాంటి పరిస్థితులు ఉండేవో ఇప్పుడు అదే రకమైన పరిస్థితులు ఉన్నాయి. ఎరువుల కోసం క్యూలు, దొరక్క రైతులకు అవస్థలు, బ్లాక్ మార్కెట్‌ను ఆశ్రయిస్తున్న పరిస్థితులు, ప్రైవేటు వ్యాపారులు ఎంత చెబితే అంతకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి పునరావృతమైంది.

చెలరేగిపోతున్న టీడీపీ నాయకులు

ఇదే అవకాశంగా తీసుకుని టీడీపీ నాయకులు చెలరేగిపోతున్నారు. ప్రభుత్వం ద్వారా అందించే ఎరువులపై పెత్తనం చెలాయిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల వద్ద దించాల్సిన ఎరువులను తమ ఇళ్ల వద్ద దించుకుంటున్నారు. కొన్ని చోట్ల తమ కనుసన్నల్లో నడిచే పీఏసీఎస్‌ల వద్ద దించుతున్నారు. ఇంకొందరు తమ ప్రైవేటు గోడౌన్‌లలో దించుతున్నారు. అధికారులు సైతం తలొగ్గడంతో తమ ఆధీనంలో దించుకున్న ఎరువులను తమకు కావాల్సిన వారికే విక్రయిస్తున్నారు. ఫలితంగా టీడీపీ సానుభూతి పరులకు ప్రభుత్వం సరఫరా చేసే ఎరువులు అందుతున్నాయి. మిగతా వారు ప్రైవేటు డీలర్లను ఆశ్రయించక తప్పడం లేదు. ఎక్కువ రేటుకు కొనుగోలు చేసుకోవల్సిన దుస్థితి నెలకొంది. పీఏసీఎస్‌లు పేరుకే ప్రభుత్వ సంస్థ అయినప్పటికీ అధికార పార్టీ నాయకుల పెత్తనం ఉండటంతో అక్కడ వారి మాటే పైచేయి అవుతుంది. వాళ్లు చెప్పిన వారికి ఎరువుల పంపిణీ చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో కూడా ఇదే పరిస్థితి కనబడుతోంది. ఇక్కడ కూడా అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లలో వారిచ్చిన రైతుల సిఫార్సుల జాబితా మేరకే ప్రభుత్వం ద్వారా సరఫరా చేయాల్సిన ఎరువులను అందజేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

ఈ ఫొటో చూడండి? వచ్చిన యూరియాలో 80 బస్తాల వరకు పక్క దారి పట్టించారని, బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకోవడానికి టీడీపీ నాయకులు కుట్ర పూరితంగా వ్యవహరించారని పొందూరు మండలం బాణం గ్రామంలో యూరియా లారీకి అడ్డంగా రైతులు నిలబడి నిలదీసిన దృశ్యమిది. గ్రామస్తులంతా ఎదురు తిరిగి ఆందోళన చేయడంతో పాటు వ్యవసాయ అధికారిని నిలదీయడంతో దారికొచ్చారు.



వైఎస్ జగన్ హయాంలో రైతుల ఇంటికే ఎరువులు..

గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఈ క్రాప్‌లో నమోదు చేసుకున్న విస్తీర్ణం మేరకు రైతుకు అవసరమైన ఎరువులు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందజేసేవారు. దీంతో రైతులందరికీ సరిపడా ఎరువులు చేరేవి. మధ్యవర్తుల జోక్యం ఉండేది కాదు. బ్లాక్ మార్కెట్, కమిషన్ల గొడవ ఉండేది కాదు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఆ పరిస్థితి మారింది. సీజన్‌కు ముందు ఈ–క్రాప్ నమోదు కాలేదు. రైతులకు సరిపడా ఎరువులను సరఫరా చేయడం లేదు. వచ్చిన అరకొర ఎరువులు కాస్త టీడీపీ నాయకుల చేతుల్లోకి, అజమాయిషీలోకి వెళ్లిపోయాయి. అధికారం చేతిలో ఉండటంతో వాళ్లు చెప్పిందే జరగాలని అధికారులను సతాయిస్తున్నారు. అధికారులు సైతం వంత పాడటంతో టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే ఎరువుల పంపిణీ జరుగుతున్న పరిస్థితి నెలకొంది.

బాసూ.. ఇది లోకల్ పాసు!

పలాస నియోజకవర్గంలో ఇసుకాసురులు బరి తెగించారు. ఇసుకను ఇష్టానుసారం రవాణా చేసేందుకు ఏకంగా తమ వాహనాలకు స్టిక్కర్లు అతికించి లోకల్ పాస్‌ను రూపొందించుకున్నారు. లారీలకు ఆ స్టిక్కర్లు అతికిస్తే చాలు అధికారులు కూడా వదిలేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. అసలు ఈ స్టిక్కర్ల కథ ఏమిటో పరిశీలిస్తే..

జిల్లాలో ఎక్కడా లేని విధంగా పలాస నియోజకవర్గంలో మాత్రం లారీలకు స్టిక్కర్లు అతికించి ఇసుక అక్రమ రవాణా చేపడుతూ ట్రాక్టర్ ఇసుక రూ.ఐదు వేలకు విక్రయిస్తున్నారు. పలాసలో సుమారు 50 ఇసుక లారీలు ఉన్నాయి. ఈ లారీలు రాత్రి బయల్దేరి ఇసుక రీచ్‌కు చేరుకొని వేకువజామున పలాస చేరుకొని ఏదో ఒక ప్రాంతంలో డంప్ చేసి తద్వారా ట్రాక్టర్లకు రూ.ఐదు వేలకు విక్రయాలు జరుపుతున్నాయి. నిబంధనల మేరకైతే లారీ యాజమాని ఆధార్ కార్డు చూపించి ఇసుక రీచ్‌ల నుంచి తీసుకురావాల్సి ఉండగా యాజమానులు డమ్మీ ఆధార్ కార్డులను వినియోగిస్తూ ఇష్టారాజ్యంగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది. అక్రమాలకు పాల్పడ్డావని నిలదీస్తే సమాధానంగా స్టిక్కర్ చూపిస్తున్నారు. స్టిక్కర్ చూపించి ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అని ఎదురు తిరుగుతుండడం విశేషం. ఈ స్టిక్కర్ కోసం లారీ యాజమాని నెలకు ఒకసారి కొంత ముడుపు చెల్లించాల్సి ఉంటుంది. అనంతరం నెలంతా ఎన్నిసార్లు ఇసుక ఎత్తుకెళ్లినా అడిగే వారుండరు. అసలు ఈ స్టిక్కర్లు లారీ యాజమానులుకు ఎవరు సరఫరా చేస్తున్నారు. ఆ డబ్బులన్నీ ఎవరి జేబులకు వెళ్తున్నాయి అనే లెక్కలు తేలాల్సి ఉంది. –కాశీబుగ్గ



పలాస వచ్చిన ఇసుక లారీలకు అతికించిన స్టిక్కర్లు

సత్తారు గోపి హత్యలో
నిందితులు వారేనట!

- ఫరీదుపేట వైఎస్సార్ సీపీ కార్యకర్త హత్య కేసులో 8 మంది అరెస్టు
- హత్య పథకం ప్రకారం చేసింది కాదని పోలీసుల నిర్ధారణ
- జిల్లా పోలీసు కార్యాలయంలో వివరాలు వెల్లడించిన అదనపు ఎస్పీ, డీఎస్పీలు

శ్రీకాకుళం క్రైమ్ :

ఫరీదుపేట వైఎస్సార్‌సీపీ కార్యకర్త సత్తారు గోపి హత్య హఠాత్తుగా జరిగిందని, పథకం ప్రకారం చేసింది కాదని అదనపు ఎస్పీ కేవీ రమణ (అడ్మిన్) అన్నారు. ఈ కేసుకు సంబంధించి శనివారం ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేశామని, మరికొందరు అనుమానితుల ప్రమేయం ఉందన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని, కేసు ఇంకా ముగియలేదన్నారు. హత్యకు ముందు నిందితులు ఎన్‌హెచ్–16 వద్ద ఓ బార్‌లో మద్యం తాగి గోపి కోసం కాపు కాశారని తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం డీఎస్పీ సీహెచ్ వివేకానందతో కలిసి విలేకరులతో మాట్లాడారు. భార్యాభర్తల తగువులో రెండు వర్గాలు పాల్గొనడం వల్లనే హత్య జరిగిందని, ఆ రెండు వర్గాల మధ్య పాత కక్షలు కూడా ఓ కారణమని నిర్ధారణకు వచ్చామని అదనపు ఎస్పీ స్పష్టం చేశారు.

భార్యాభర్తల పంచాయితీనే మూలం..

ఫరీదుపేట గ్రామానికి చెందిన గురుగుబెల్లి ఉమామహేశ్వరరావు, అతని భార్య భవానీ మధ్య తగువులు ఉన్నాయని, ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి వద్దకు ఆయన అనుచరుడు సత్తారు గోపి దీనిపై పంచాయితీ పెట్టాడని తెలిపారు. భవానీ తరపున కొత్తకోట అమ్మినాయుడు వర్గం వారు కూడా ఆ పంచాయితీకి వెళ్లడం, ఎంపీపీ చిరంజీవి ఉమామహేశ్వరరావుకు అనుకూలంగా మద్దతివ్వడంతో భవానీకి నచ్చలేదన్నారు. ఈ క్రమంలో ఆమె ఎచ్చెర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారని, భార్యభర్తలిద్దరికీ కౌన్సిలింగ్‌కు రెండు మూడుసార్లు ఎస్ఐ పిలిచినా ఉమామహేశ్వరరావు హాజరు కాలేదని తెలిపారు. చివరికి నోటీసు ఇచ్చినా రాకపోవడంతో ఉమామహేశ్వరరావుపై కేసు నమోదు చేశారని అదనపు ఎస్పీ అన్నారు.

సామాన్లు తీసుకురావడంతో..

ఈ క్రమంలో ఈ నెల 11 ఉదయం భవాని తన వర్గీయుల సమక్షంలో భర్త ఉమామహేశ్వరరావు ఇంటికి వెళ్లి తలుపులు పగులగొట్టి తన సామాన్లు ఎక్కించుకుని కొయ్యిరాల జంక్షన్ సమీప ఎన్‌హెచ్–16 వద్దనున్న తన తల్లి మొదలవలస శారద ఇంటిలో పెట్టిందన్నారు. విషయం తెలుసుకున్న భర్త ఉమామహేశ్వరరావు గోపికి చెప్పాడని, గోపి భవానితో గొడవపడేందుకు వస్తున్నాడన్న సమాచారాన్ని సోమేష్ అనే వ్యక్తి ఫోన్ ద్వారా భవానీకి చెప్పారన్నారు. అప్పటికే సామాన్లు లోడు దించిన భవాని తరపు వారు కొత్తకోట సూర్యనారాయణ అలియాస్ సూరి, పైడిపెద్ది సత్యనారాయణ అలియాస్ ధోని, కొత్తకోట ఈశ్వరరావు, కొత్తకోట రంగనాథం అలియాస్ తపేలా రంగడు, సీపాన శివకృష్ణ అలియాస్ శివ, సీపాన అనిల్‌కుమార్, పైడి రంగారామానుజులు, కొత్తకోట రమణమూర్తి అక్కడే ఉన్నారని పేర్కొన్నారు.

మద్యం సేవించి మరీ..

భోజనాలకు ముందు వారికి రూ. 2 వేలు ఇవ్వడంతో సమీప బార్‌లో మద్యం సేవించి భోజనాలు చేసి పెద్దసామాన్లు ఇంట్లో సర్దేందుకు ఉన్న సమయంలో సత్తారు గోపి బైక్‌పై సత్తారు కోటేశ్వరరావు తోడుగా వచ్చాడన్నారు. వచ్చీ రావడంతోనే మేడ మీద భవాని ఉండటంతో నువ్వు సామాన్లు ఎలా తెస్తావు అని ఆమెను కింద నుంచి కేక వేయగా.. సామాన్లు తెస్తే నీకేంటని భవాని వర్గం ఎదురుతిరిగారన్నారు. దీంతో బైక్‌పై తమ్మినేని సత్యనారాయణ ఇంటిముందుకొచ్చేసరికి వెంటనే కర్రలతో దాడి చేశారన్నారు. జరిగిన ఈ హఠాత్పరిణామానికి ప్రత్యక్ష సాక్షి కోటేశ్వరరావు అక్కడి నుంచి పారిపోయాడని తెలిపారు. పట్టపగలు కావడంతో రోడ్డు మీదైతే ఇబ్బందిగా ఉంటుందని సందు లోపలికి తీసుకెళ్లి కర్రలతో దాడిచేశారన్నారు. పక్కనే ఉన్న ఇటుకతో తలపైకొట్టగా గోపి ప్రాణాలు వదిలాడని తెలిపారు.

గాలింపు బృందాలతో..

దీనిపై ప్రత్యక్ష సాక్షి సత్తారు కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీఐ ఎం.అవతారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పర్యవేక్షణలో డీఎస్పీ వివేకానంద ఆధ్వర్యంలో మూడు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం ఉదయం సీఐ అవతారానికి వచ్చిన సమాచారంతో ఎస్ఎం పురం గ్రామానికి చెందిన పొలాలకు వెళ్లే మట్టిరోడ్డు మార్గంలో ఎనిమిది మంది వీఆర్వో సమక్షంలో పట్టుబడటంతో వారిని అరెస్టు చేశారు. మిగతా వారి కోసం దర్యాప్తు చేస్తున్నామని, పట్టుబడిన నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు అదనపు ఎస్పీ కేవీ రమణ, డీఎస్పీ వివేకానంద పేర్కొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ రమణ, డీఎస్పీ వివేకానంద

అదొక హఠాత్పరిణామమట!

- ఫరీదుపేట హత్యోదంతంలో వివాదాస్పదంగా పోలీసుల వైఖరి
- అసలు సూత్రధారుల జోలికి వెళ్లని వైనంపై సర్వత్రా విస్మయం

శ్రీకాకుళం క్రైమ్:

జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫరీదుపేట వైఎస్సార్ సీపీ కార్యకర్త సత్తారు గోపి హత్యోదంతంలో పోలీసులు ఊహించిన పనినే చేశారు. శనివారం ఉదయం ఈ కేసుకు సంబంధించి అసలు సూత్రధారిని తప్పించి, ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్టు చేసి మీడియా ముందు ప్రవేశపెట్టారు. భార్యాభర్తల తగువులో రెండు వర్గాలు జోక్యం చేసుకోవడంతో పాటు పాత కక్షలే హత్యకు ప్రధాన కారణమని తేల్చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీ కేవీ రమణ (అడ్మిన్), డీఎస్పీ సీహెచ్ వివేకానంద విలేకరులకు శనివారం వివరాలు వెల్లడించారు. విలేకరులడిగిన పలు ప్రశ్నలకు ఇలా సమాధానం ఇచ్చారు.

పాత్ర రుజువైతే అరెస్టులు తప్పవట..

అరెస్టయిన ఎనిమిది మంది టీడీపీకి చెందిన అమ్మినాయుడు అనే నాయకుడి అనుచరులని సమాచారం. అయితే దీనిపై విలేకరులు ప్రశ్నిస్తూ.. ప్రధాన వ్యక్తిని తప్పించి మిగతా వారిని అరెస్టు చేయడం కొద్ది రోజులుగా జరుగుతోందని, ఇలాగే కొనసాగితే హత్యల సంస్కృతి ఆగదని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై డీఎస్పీ వివేకానంద బదులిస్తూ.. ఎస్పీ ఆధ్వర్యంలో యాక్షన్ ప్లాన్ తప్పకుండా ఉంటుందని, దర్యాప్తు ముగియలేదని, ఇంకా నడుస్తుందని, కేసులో ఇన్వాల్వ్ అయిన ఏ ఒక్క వ్యక్తిని వదిలిపెట్టేది లేదని, మున్ముందు మీరే చూస్తారని, మిగతావారిని అరెస్టు చేయకపోతే అప్పుడు అడగండని అన్నారు. అమ్మినాయుడు, మరికొందరు అనుమానితులకు సంబంధించి సమాచారాన్నైతే సేకరించామని, విలువైన ఎవిడెన్సులు, సాక్ష్యాధారాలు సేకరించే పనిలో ఉన్నామని అన్నారు. నెలాఖరుకల్లా హత్యానేరంలో వారి పాత్ర రుజువైతే తప్పక అరెస్టులు చూపిస్తామని చెప్పారు.

భార్యా భర్తల తగువుకు, గోపి హత్యకు సంబంధం ఏమిటి..?
ఎస్ఐ కేసు కట్టడం వెనుక ఆంతర్యం ఏమిటి..

భార్యాభర్తల తగువులో సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం కౌన్సిలింగ్ చేసిన తర్వాత ఇద్దరూ వినని పక్షంలోనే కేసు కట్టినట్లు పోలీసులు తెలిపారు. భర్త ఉమామహేశ్వరరావుకు కౌన్సిలింగ్‌కు రెండు మూడుసార్లు రమ్మన్నా రాలేదని, ఎస్ఐ నోటీసులు పంపినా రాలేదని డీఎస్పీ అన్నారు. ఉమామహేశ్వరరావు తరపున గోపి నిలబడటం, సామాన్లు ఎలా నువ్వు తెస్తావు అని ఆమెను అడగడంతోనే ఆమె వైపున్న వీరంతా దాడి చేయడం అది హత్యకు దారితీయడం జరిగిందన్నారు.

సీసీ ఫుటేజీ మాటేమిటి..?

డీవీఆర్ సీజ్ చేసి ప్రయోజనమేమిటట!

సీసీ కెమెరా ఘటనా స్థలిలో చెట్టుకు ఉన్నమాట నిజమేనని, దాని డీవీఆర్ లాస్ట్‌షాపులో ఉందని, ఓనర్‌ను విచారించామని తెలిపారు. కెమెరా పెట్టినప్పటి నుంచి దానికి కనెక్షన్ ఇవ్వలేదని అందుకే డీవీఆర్ సీజ్ చేశామన్నారు.

గోపి తనపై దాడికి వస్తున్నాడనడంతోనే భవానీ ఈ నిందితులందరినీ హత్యకు పురిగొల్పిందా..

గోపితో పాటు బైక్‌పై వస్తుంది ఒక్కరే కదా.. అడగడానికి వచ్చే వ్యక్తి ప్రత్యర్థులు ఎక్కువమంది ఉంటే ఎలా దాడి చేస్తాడు..

హత్య ప్రణాళిక ప్రకారం జరిగిందే కదా..!



గోపి మృతదేహం (ఫైల్)

గోపి హత్య జరిగిన ప్రాంతంలోనే భవానీ తల్లి ఇల్లు ఉందని, మేడపై భవాని ఉండగానే గోపి అక్కడకు వచ్చి సామాన్లు ఎలా తెస్తావని కింద నుంచి ప్రశ్నించడంతోనే అప్పటికే గూమిగూడిన ఆమె తరపు వారంతా మద్యం మత్తులో ఈ దాడికి పాల్పడ్డారన్నారు. అంతేకాని ప్లాన్ ప్రకారం చేయలేదని సమాధానం ఇచ్చారు.

క్లుప్తంగా

సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు


కిలారి నారాయణరావు

అరసవల్లి: జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తున్న ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారులుగా పదోన్నతులు కల్పిస్తూ జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా ఉత్తర్వులు జారీ చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అధికారిక ఆదేశాల ప్రకారం నిర్వహించిన ఈ పదోన్నతుల ప్రక్రియ అంతా పారదర్శకంగా జరిగింది. కాగా పాలకొండ ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రజనీకాంత్‌ను భామిని ఎంపీడీవో కార్యాలయ ఏఓగా, ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కిలారి నారాయణరావుకు కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయ ఏఓగా పదోన్నతి కల్పించారు. జిల్లా పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కిలారి నారాయణరావుకు ఏవోగా పదోన్నతి లభించడంపై సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్, సీఈఓలకు నారాయణరావు ధన్యవాదాలు తెలియజేశారు.

పరిశుభ్రత పాటించాలి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జేసీ

జలుమూరు : ప్రతిఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. కరవంజలో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం మోడల్ స్కూల్‌ను సందర్శించారు. మధ్యాహ్న భోజనం చేసి నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు రేషన్ డిపో తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జెన్ని రామారావు, ఎంపీడీఓ కె.అప్పలనాయుడు, పంచాయతీ విస్తరణ అధికారి ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్, ఎంఈఓలు మాధవరావు, ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ అనిత

కొత్తూరు: విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డీఎంహెచ్ఓ కె.అనిత అన్నారు. కొత్తూరు మండలం కారిగూడ గిరిజన గ్రామంలో మినీ గురుకులాన్ని శనివారం సందర్శించారు. విద్యార్థినుల ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. జ్వరం బాధపడుతున్న విద్యార్థినులను ప్రత్యేక గదిలో ఉంచి చికిత్స అందించాలని నిర్వాహకులకు సూచించారు. గిరిజన బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మెట్టూరు పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబును ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న రాష్ట్ర ఫ్యాక్టరీల విభాగం డైరెక్టర్ చంద్రశేఖర్ వర్మ

రణస్థలం: పరిశ్రమలు పర్యావరణ పరిరక్షణ, కార్మిక భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని ఏపీ రాష్ట్ర ఫ్యాక్టరీల విభాగం డైరెక్టర్ డి.చంద్రశేఖర్ వర్మ అన్నారు. రణస్థలం మండలంలోని ఆపిటోరియా ఫార్మాలో స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్మికులు, ఉద్యోగుల కుటుంబాలు, చిన్నారులకు భద్రతా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర్ రెడ్డి, ఫ్యాక్టరీ మేనేజర్ ఎస్.మధన్‌కుమార్, ఈహెచ్ఎస్ హెడ్ ఈ.సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లకు 30 రోజుల జైలుశిక్ష

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాకేంద్రంలోని ఒకటో పట్టణ పరిధి కామేశ్వరి కల్యాణ మండపం వెనక పేకాట ఆడుతూ పట్టుబడిన ఐదుగురికి న్యాయస్థానం 30 రోజుల పాటు జైలు శిక్ష విధించిందని ఎస్ఐ ఎం.హరికృష్ణ వెల్లడించారు. పట్టుబడిన బి.గోవింద (గోల్డ్ గోపి)పై 3 కేసులు, బి.ప్రసాద్‌పై 7, ఎం.మోహనకృష్ణపై రెండు కేసులు ఉన్నాయని వివరించారు. వీరిని శనివారం శ్రీకాకుళం స్పెషల్ జ్యుడీషియల్ సెకెండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ శివరామకృష్ణ ముందు హాజరుపర్చగా నేరం రుజువై జైలుశిక్ష విధించారని పేర్కొన్నారు. అనంతరం జిల్లా జైలుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

కబడ్డీ..కబడ్డీ..!


కబడ్డీ సాధనలో యువ క్రీడాకారులు

- తెలుగు కబడ్డీ లీగ్ టోర్నీకి సై
- గ్రామీణ ప్రాంతాల్లో యువ టాలెంట్‌ను గుర్తించేందుకు ఆంధ్రా కబడ్డీ సంఘం శ్రీకారం
- ఆగస్ట్ 15 నుంచి 25 వరకు లీగ్ మొదటి సీజన్
- ఈ నెల 25న కాకినాడ వేదికగా ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: గ్రామీణ క్రీడగా విరసిల్లుతున్న కబడ్డీకి సిక్కోలు పెట్టింది పేరు. ఇప్పటికే కబడ్డీ ఆటగాళ్లను ప్రోత్సహించేందుకు దేశంలో ప్రో కబడ్డీ లీగ్ వంటి మెగా టోర్నమెంట్లు జరుగుతున్నాయి. తాజాగా మన రాష్ట్రంలోనూ గ్రామీణ స్థాయిలో ప్రతిభ కలిగిన యువ ఆటగాళ్లను ప్రోత్సహించేందుకు ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ నడుం బిగించింది. 'తెలుగు కబడ్డీ లీగ్' పేరిట మెగా టోర్నమెంట్ నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకు ప్రభుత్వం కూడా అనుమతిచ్చింది. టోర్నీ విజేతకు 'యువ ఆంధ్రా కబడ్డీ చాంపియన్‌షిప్' టైటిల్‌ను అందజేయనున్నారు. కేపీఎల్ మాదిరిగానే వివిధ జట్లగా ఎంపికచేసి ఆగస్టు 15 నుంచి 25వ తేదీ వరకు తెలుగు కబడ్డీ లీగ్ టోర్నీని నిర్వహించాలని నిర్ణయించారు. టోర్నీకి మొత్తం 8 జట్లను ఎంపిక చేయనున్నారు. నాలుగేసి జట్లను ఏ, బీ పేరిట రెండు గ్రూపులుగా చేసి పోటీలు నిర్వహిస్తారు. ఒక్కొక్క జట్టులో 12 మంది కీలకమైన ఆటగాళ్లు, మరో ఐదుగురు రిజర్వ్ ఆటగాళ్లను ఎంపిక చేయనున్నారు. పోటీలు జరిగే వేదికలు ఖరారు కావాల్సి ఉంది.

విజేతలకు, క్రీడాకారులకు ప్రతి మ్యాచ్‌లోనూ నగదు బహుమతులు, ఇతర నజరానాలు ప్రకటించేలా ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ సన్నాహాలు చేస్తోంది. ఇందులో పాల్గొనబోయే జట్ల ఎంపికలను ఈ నెల 25న ఉదయం 7 గంటల నుంచి కాకినాడలోని పీ.ఆర్.ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ క్రీడా మైదానం వేదికగా నిర్వహించనున్నారు.

నిబంధనలివే..

- టోర్నీకి సంబంధించి కొన్ని నిబంధనలు విధించారు. ప్రతి జట్టులో ఐదుగురు క్రీడాకారులు 23 ఏళ్ల లోపు వయస్సు వారై ఉండాలి (27-2-2003 తర్వాత జన్మించినవారు).
- ప్రతి జట్టులో ఏడుగురు క్రీడాకారులు 25 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలి (27-2-2001 తర్వాత జన్మించినవారు). మొత్తమ్మీద కాకినాడలో జరిగే సెలక్షన్‌లో పాల్గొనే క్రీడాకారులు 2001 ఫిబ్రవరి 27 తర్వాత జన్మించినవారై 85 కేజీలలోపు బరువు ఉండాలని ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ పెద్దలు స్పష్టంచేశారు.

జిల్లా క్రీడాకారులకు వరం

శ్రీకాకుళం జిల్లా గ్రామీణ క్రీడలకు పుట్టినిల్లు. జిల్లాలో ఎంతోమంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారు. వీరందరికీ తెలుగు కబడ్డీ లీగ్ టోర్నమెంట్ వరంలా మారబోతుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అభిప్రాయపడింది. జిల్లాలో యువ, వర్ధమాన, సీనియర్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు నక్క రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి సాధు ముసలినాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి సాదు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. టోర్నీలో రాణించిన వారికి బంగారు భవిష్యతుకు బాటలు వేసుకోవచ్చని, ప్రో కబడ్డీ లీగ్‌కి సైతం చాన్స్ లభించవచ్చన్నారు. ఈ నెల 25వ తేదీన కాకినాడలో జరిగే సెలక్షన్ ట్రయల్స్‌కు నిర్దేశిత ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు 9441914214 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఆరుతడి వరిసాగు లాభదాయకం


యంత్రాలతో విత్తనాలు, ఎరువులు వేస్తున్న వ్యవసాయాధికారులు

రణస్థలం: మారిన వాతావరణ పరిస్థితులలో తక్కువ నీటితో లాభదాయక దిగుబడులు పొందడం ఆరుతడి వరిసాగు విధానం ద్వారే సాధ్యమని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. శనివారం రణస్థలం మండలం వెంకటరావుపేటలో యంత్రం ద్వారా విత్తనం, ఎరువు ఒకేసారి వేసే విధానంపై రైతులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాధార భూములు, తక్కువ నీటి వనరులున్న పొలాలకు ఈ విధానం అనుకూలంగా ఉంటుందన్నారు. డ్రమ్ సీడింగ్ యంత్రాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. దీనివల్ల ఎకరాకు 15 నుంచి 16 కేజీల విత్తనం సరిపోతుందన్నారు. నారుమడి పెంపకం, నాట్లు అయ్యే ఖర్చు తగ్గడమే కాక పంట కూడా సుమారు వారం రోజులు ముందే కోతకు వస్తుందని చెప్పారు. వరుస విధానం వల్ల పురుగులు, తెగుళ్ల సమస్య తక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.విజయభాస్కర్, ఏఈఓ వై.రాజశేఖర్, వీఏఏ సంధ్య, ప్రాంతీయ మేనేజర్ పి.తవిటినాయుడు, సమన్వయకర్తలు ఎస్.పి.నారాయణరావు, పి.రమణ, గ్రామ వ్యవసాయ సహాయకులు, లీడ్ ఫార్మర్లు కె.రాము తదితరులు పాల్గొన్నారు.

గోపి కుటుంబ సభ్యులకు తమ్మినేని పరామర్శ


సత్తారు గోపి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

రణస్థలం: ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటలో సత్తారు గోపి ఇటీవల హత్యకు గురైన నేపథ్యంలో కుటుంబ సభ్యులను మాజీ స్పీకర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు తమ్మినేని సీతారాం శనివారం పరామర్శించారు. గోపి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ కళింగ కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు, నాయకులు పప్పల రమేష్, బొడ్డేపల్లి నారాయణమూర్తి, ఎర్రంనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐదు టన్నుల పశుమాంసం పట్టివేత


కంటైనర్‌లో ఉన్న పశుమాంసం

మందస: మదనాపురం–భిన్నాళి సమీపంలో జాతీయ రహదారిపై పశుమాంసం తరలిస్తున్న కంటైనర్ లారీని పోలీసులు పట్టుకున్నారు. కోల్‌కతా నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఈ వాహనంలో సమారు 5 టన్నులు పశుమాంసం ఉందని మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ తెలిపారు.

డ్రైవర్ రాజమండ్రి చెందిన వెంకన్నగా గుర్తించామని చెప్పారు. పూర్తిగా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వెంకటాపురంలో కక్ష రాజకీయాలు!


గట్లు కొట్టించేందుకు తీసుకొచ్చిన ప్రొక్లెయినర్లు

- పూర్వీకుల నుంచి సాగుచేస్తున్న భూమిపై టీడీపీ నేతల ఫిర్యాదులు
- వైఎస్సార్ సీపీకి చెందిన వ్యక్తి పొలం గట్లు కొట్టేసిన అధికారులు
- కోర్టులో కేసు నడుస్తుందన్నా వినని వైనం

శ్రీకాకుళం రూరల్: కూటమి ప్రభుత్వం వచ్చాక కక్ష రాజకీయాలు పెరిగిపోతున్నాయి. వైఎస్సార్ సీపీకి చెందిన సానుభూతిపరులపై వేధింపులు ఎక్కువవుతున్నాయి. శ్రీకాకుళం రూరల్ మండలం నైరా పంచాయతీ వెంకటాపురంలో సర్వే నెంబర్ 1(3)లో ఎకరా భూమిని అదే గ్రామానికి చెందిన రైతు గదిల దాళింగరావు దశాబ్దాల కాలం నుంచి సాగు చేసుకుంటున్నారు. ఇటీవల కొందరు టీడీపీ నాయకులు కక్షపూరిత రాజకీయాలకు దిగారు. సదరు రైతు సాగు చేస్తున్న భూమి చెరువు గర్భంలో ఉందంటూ కొందరు వ్యక్తులచే గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయించారు. దీనిపై స్పందించిన శ్రీకాకుళం ఎంపీడీఓ బొడ్డేపల్లి శైలజ, రెవెన్యూ సిబ్బంది శనివారం పోలీసు బందోబస్తుతో సంబంధిత భూమి వద్దకు వెళ్లారు. మూడు ప్రొక్లెయినర్లు పెట్టి గట్లు కొట్టించేశారు. ఈ వ్యవహారంపై కోర్టులో కేసు నడుస్తోందని బాధిత రైతు అధికారుల వద్ద మొరపెట్టుకున్నా వారు పట్టించుకోలేదు. తమకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయంటూ గట్లు కొట్టేసి వెళ్లిపోయారు.

సొమ్మసిల్లిన పంచాయతీ సెక్రటరీ

పొలం గట్లు తొలగించేందుకు ఉదయమే గ్రామానికి చేరుకున్న అధికారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలీసులు రాకపోవడంతో ఎండదెబ్బకు గురయ్యారు. ఎండ వేడి తట్టుకోలేక పంచాయతీ సెక్రటరీ మౌనిక పొలంలోనే సొమ్మసిల్లిపోయారు. స్థానికులు, అధికారులు స్పందించి సపర్యలు చేయడంతో కోలుకున్నారు.

కక్షతోనే..



దశాబ్దాలుగా ఎకరా భూమిని సాగుచేస్తున్నాం. నేను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకు చెందినవాడినంటూ స్థానిక టీడీపీ నేతలు కక్ష కట్టారు. చెరువు గర్భంలో భూమి ఉందంటూ కొంతమందితో తప్పుడు ఫిర్యాదులు పెట్టించారు. కోర్టులో కేసు నడుస్తున్నా అధికారులు ఇలా చేయడం తగదు.

– గదిల దాలింగరావు, రైతు

అన్ని పత్రాలు ఉన్నాయి



నా వయస్సు 80 ఏళ్లు. ఇందిరాగాంధీ ప్రభుత్వ హయాంలో డి పట్టా భూమిని అందజేశారు. దశాబ్దాలుగా వివిధ రకాల పంటలు పండిస్తూ సాగు చేస్తున్నాం. ఆ విషయం టీడీపీ నాయకులకూ తెలుసు. అయినప్పటికీ మాపై కక్షపూరిత రాజకీయాలు చేయడం దారుణం.

– గదిల అమ్మన్నమ్మ, బాధితురాలు

బాలియాత్రకు విరాళాలు వద్దు

జలుమూరు : శ్రీముఖలింగంలో నవంబరులో కార్తిక పౌర్ణమి అనంతరం నిర్వహించనున్న బాలియాత్రకు భక్తులు, దాతల నుంచి ఎటువంటి విరాళాలు స్వీకరించడం లేదని నిర్వహణ కమిటీ సభ్యుడు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించేందుకు కలెక్టర్‌కు వినతిపత్రం అందించగా సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. యాత్ర నిర్వహణకు సాయం చేయదలచుకుంటే భక్తులకు తాగునీరు, మజ్జిగ, టెంట్లు, విద్యుత్ అలంకరణ, స్నానాల ఘాట్‌లు శుభపరచడం వంటివి చేయవచ్చని తెలిపారు. బాలియాత్ర ఒక కులానికి సంబంధించనది కాదని, కళింగ రాజ్యానికి చెందినదని స్పష్టం చేశారు. కుల, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలు సహకరించాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం


ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతులు

మందస: మండలంలోని కొత్త కమలాపురం, బాలిగాం సమీపంలో పొలాల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని రైతులు బొంగి వెంకయ్య, బొంగి సీతారాం, భావన సాంబమూర్తి, సేపాన నారాయణ, కోండియా నారాయణస్వామి తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ దుండగులు రాత్రివేళల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తూ లోపలున్న రాగిని అమ్ముకుంటున్నారని చెప్పారు. విషయాన్ని విద్యుత్ శాఖాధికారి ఎల్.యోగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు.

చిన్నారికి కలెక్టర్ కుశల ప్రశ్నలు


హిరమండలం చిన్నారితో ముచ్చటిస్తున్న కలెక్టర్

హిరమండలం: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఓ చిన్నారిని చేరదీసి కుశల ప్రశ్నలు వేయడం అందరినీ ఆకట్టుకుంది. హిరమండలం మండల పర్యటనకు వచ్చిన కలెక్టర్ గొడియపాడు గ్రామంలో బిడ్డిక శామ్యూల్ అనే రెండో తరగతి విద్యార్థిని దగ్గర తీసుకున్నారు. బైక్‌పై కూర్చోబెట్టి చిన్నారితో ముచ్చటించారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు ఆసక్తిగా సమాధానాలు చెప్పాడు శామ్యూల్. దీంతో కలెక్టర్ ముచ్చటపడిపోయారు. చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని దీవించారు.

పర్యాటక రంగానికి ఊతం

హిరమండలం: హిరమండలం పరిసర ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి ఆదాయంతో పాటు స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని కలెక్టర్ స్వప్నిల్ దిన్కర్ పుండ్కర్ అన్నారు. శనివారం ఆయన హిరమండలంలోని వంశధార రిజర్వాయర్, ఉద్దానం సమగ్ర మంచినీటి పథకం, లోకొండ పంచాయతీ పూలకొండ, గుడియాపాడు ప్రాంతాలను పరిశీలించారు. ఇక్కడ పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అనువైన ప్రాంతాలు ఉన్నాయని చెప్పారు. కూతవేటు దూరంలో ఆధ్యాత్మిక గ్రామమైన కూర్మ, శ్రీముఖలింగం ఉన్నాయన్నారు. గిరిజన ఉత్పత్తులకు సైతం మార్కెటింగ్ సదుపాయం కలుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గొడియాపాడులో హిల్‌స్పాట్‌ను సందర్శించారు. కలెక్టర్‌తో పాటు ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, తహసీల్దారు హనుమంతరావు, ఎంపీడీఓ కాశీప్రసాదరావు, డిప్యూటీ ఎంపీడీఓ గోవిందరావు, సీఏపీఎస్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పడాల భూదేవి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మీద రోడ్డు.. మాకెవరు అడ్డు!


కొత్తూరు మండలం నివగాంలో బాగా ఉన్న సీసీ రోడ్డుపై మరో సీసీ రోడ్డు వేయడం విమర్శలకు తావిస్తోంది. స్థానిక టీడీపీ నేత.. ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకుండానే రోడ్డు పనులు చేయిస్తున్నాడని అదే గ్రామానికి చెందిన పలువురు పంచాయతీరాజ్ జేఈఈ దుర్గాప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. నిధులు దుర్వినియోగం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. – కొత్తూరు

పాతపట్నంలో టీడీపీకి షాక్!

- జనసేనకు హిరమండలం ఏఎంసీ పోస్టు
- కనీసం సమాచారం ఇవ్వకుండానే ఎంపిక
- తెలుగు తమ్ముళ్లలో ఆందోళన

హిరమండలం: నామినేటెడ్ పదవుల ఎంపికలు పాతపట్నం నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులకు తీవ్ర నిరాశకు గురిచేశాయి. ముఖ్యంగా హిరమండలం మార్కెట్ కమిటీ అధ్యక్ష(ఏఎంసీ) పదవి విషయంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలకు ఆ పార్టీ అధిష్టానం షాక్ ఇచ్చింది. అనూహ్యంగా జనసేనకు ఇక్కడి అధ్యక్ష పదవి కట్టబెట్టింది. జనసేనకు చెందిన మామిడి రామకృష్ణరావుకు పదవి వరించింది. దీంతో ఆశావహుల జాబితాలో ఉన్న వారు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. అధిష్టానం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు నేతృత్వంలో టీడీపీ నేతలు మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. అయినా ఫలితం లేకపోయింది. రాష్ట్రస్థాయిలో సర్దుబాటు కారణంగా ఇవ్వాల్సి వచ్చిందని.. ఈ విషయంలో సర్దుకోవాలని యువనేత సూచించడంతో వారు నిరాశతో వెనుదిరిగారు.

ప్రత్యేక వ్యూహంతోనే?

హిరమండలం మార్కెట్ కమిటీని జనసేన దక్కించుకోవడం వెనుక వ్యూహం ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, భవానీతో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గేదల చైతన్య ఇప్పుడు జనసేనకు పెద్ద దిక్కుగా ఉన్నారు. ఇప్పటికే శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా కొరికాన రవికుమార్ ఉన్నారు. గత ఎన్నికల్లో జనసేన టికెట్‌ను కొరికాన భవాని ఆశించారు. ఎన్నికలకు ముందు స్వచ్ఛంద సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టారు. అయితే సమీకరణల నడుమ పాతపట్నం నియోజకవర్గాన్ని టీడీపీకి కేటాయించి మామిడి గోవిందరావును అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో కొరికాన భవానీ, రవికుమార్ దంపతులు బాగానే పనిచేశారు. గోవిందరావు విజయానికి కృషిచేశారు. అయితే తమకు కూటమిలో ప్రాధాన్యం దక్కడం లేదని ఆ దంపతులు బాధపడుతుండగా.. అనూహ్యంగా రవికుమార్‌కు సుడా చైర్మన్‌గా అవకాశం దక్కింది. అప్పటి నుంచి రాజకీయంగా దూకుడు పెంచారు. భవిష్యత్ రాజకీయాల దృష్ట్యా జనసేనను నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో బలోపేతం చేస్తూ వస్తున్నారు. అందులో భాగంగా హిరమండలం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని దక్కించుకొని తెలుగుదేశం పార్టీకి ఝలక్ ఇచ్చారు.

నైరాశ్యంలో శ్రేణులు..

నియోజకవర్గంలో పాతపట్నంతో పాటు హిరమండలంలో వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. పాతపట్నం మార్కెట్ కమిటీని మెళియాపుట్టి, పాతపట్నం మండలాల్లోని నేతలకు కేటాయించేవారు. హిరమండలం ఏఎంసీని ఎల్ఎన్‌పేట, హిరమండలం, కొత్తూరు మండల నేతలు సర్దుకునేవారు. ఈ క్రమంలో పాతపట్నం మార్కెట్ కమిటీకి టీడీపీ మహిళా నేత పేరు ప్రకటించారు. కానీ హిరమండలం ఏఎంసీని మాత్రం జనసేన తన్నుకుపోయింది. దీంతో టీడీపీ శ్రేణులు నైరాశ్యంలో కూరుకుపోయాయి. ఇక్కడ ఏఎంసీ అధ్యక్ష పదవి రేసులో చాలామంది నాయకులు ఉండేవారు. అందరికంటే ముందుగా ఎల్ఎన్‌పేట మండలం బొర్రంపేటకు చెందిన సీనియర్ నేత కొవిలాపు కృష్ణమాచారి పేరు వినిపించింది. ఆయనకే అధ్యక్ష పదవి అని ప్రకటించారు. తీరా చూస్తే పదవిని జనసేనకు కేటాయించారు. కనీసం సమాచారం అందించకుండా ఎంపిక చేయడంపై తెలుగు తమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇది ఒక విధంగా టీడీపీతో పాటు స్థానిక ఎమ్మెల్యేపై పైచేయి సాధించడమే అవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మూడు అధికార కేంద్రాలు..

పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో విచిత్ర రాజకీయాలు నడుస్తున్నాయి. అధికార పార్టీ ఎమ్మెల్యేగా మామిడి గోవిందరావు ఉన్నారు. మరోవైపు టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా కలమట వెంకటరమణమూర్తి కొనసాగుతున్నారు. ఇంకోవైపు జనసేన నేత కొరికాన రవికుమార్ శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా ఉన్నారు. ఇప్పుడు మూడు అధికార కేంద్రాలు నడుస్తున్నాయి. నామినేటెడ్ పదవుల ఎంపిక విషయంలో ఎవరి ప్రయత్నాలు వారు చేశారు. తమ వారికి పదవులు ఇప్పించుకున్నారు.

అత్యంత కీలకమైన హిరమండలం మార్కెట్ కమిటీని జనసేన దక్కించుకోవడం మాత్రం టీడీపీకి లోటే. భవిష్యత్ రాజకీయానికి ఇది చక్కటి సంకేతమని ఎక్కువ మంది అభిప్రాయపడుతున్నారు. పాతపట్నం రాజకీయాల్లో హిరమండలం కీలక పాత్ర పోషిస్తోంది. అటువంటి ఏఎంసీని జనసేన ఎగురవేసుకుపోవడంతో ఇప్పుడు టీడీపీ శ్రేణులు ఆత్మరక్షణలో పడ్డాయి.

పాఠశాల పునర్నిర్మాణం చరిత్రాత్మకం


వేడుకలో పాల్గొన్న అతిథులు

మందస : మందసలో 125 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ రాజా శ్రీనివాస స్మారక ఉన్నత పాఠశాల పునఃప్రారంభ వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ చారిత్రక పాఠశాల భవనం పునఃప్రారంభం కావడం, అందులో భాగస్వామ్యం అవ్వడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. డీఈఓ తిరుమల చైతన్య మాట్లాడుతూ ఆనాటి మహారాజులు నిర్మించిన భవనాన్ని నేటి మా రాజులైన పూర్వ విద్యార్థులు పునర్నిర్మించి చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించారని కొనియాడారు. అనంతరం అతిథులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో సుమారు 16 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక జరగనుంది.